## స్త్రీకి స్త్రీయే శత్రువు కాదని ఆమె ఎలా నిరూపించింది?

# కొవ్వూరి సురేఖారెడ్డి కథ

## ఆడదే శత్రువా?

వనజ నిరసనగా మరోసారి వాచీ చూసుకుంది. ఎండలో పడి వచ్చిందేమో చాలా నీరసంగా ఉంది. ఇంటర్వ్యూ చేయవలసిన వాళ్ళు ఇంకా చాలామందే ఉన్నారు. తన వంతు ఎప్పుడు వస్తుందో ఈ జాబైనా తనకు వస్తే తమ కుటుంబం పస్తులు లేకుండా జీవించగలుగుతాం అనుకుంది వనజ కనిపించని దేవుడ్ని మనసులో తలచుకుంటూ.

ఎండ పేదవాడి కోపంలా పెళపెళలాడుతుంది, మధ్యంతర ఎన్నికల్లో గద్దె దిగిపోయే రాజకీయ నాయకుడిలా కొంతసేపటికి చల్లారక తప్పదు కదా ఇప్పుడే తన ప్రతాపం చూపాలని తీవ్రంగా రెపరెపలాడుతున్నాడు సూర్యుడు. ఇంటర్వ్యూకు వచ్చినవాళ్లు తమ కోపాన్ని ఎవరి మీద ప్రదర్శించాలో తెలియక కర్చీఫ్‌తో గట్టిగా విసురుకుంటున్నారు. నత్త నడకలా నెమ్మదిగా సాగుతుంది ఇంటర్వ్యూ. మనం కొనే కిలో పప్పులో ఎన్ని రాళ్లుంటాయి, కిలో రెండు రూపాయల బియ్యంలో ఎంత చెత్త ఉంటుంది? వగైరా ప్రశ్నలలో అభ్యర్థుల మెదడుల్లోని తుప్పును వదలగొడుతున్నారు ఇంటర్వ్యూ చేసేవాళ్ళు. అందరికీ విసుగ్గానే వుంది.

కానీ ఏమీ చేయలేని పరిస్థితి. ఉన్న పోస్టులు తక్కువ. వాటికోసం వచ్చిన జనాభా ఎక్కువ. ఈ జాబ్స్ ఎవర్ని వరిస్తాయో వీటి వెనుక ఎన్ని లొసుగులున్నాయో ఇంతకుముందే ఎవరి చేతులు తడిపేసి రిజర్వు చేసేసుకున్నారో లేక న్యాయంగా మెరిట్‌ని బట్టే ఇస్తారో వగైరా రకరకాల ఊహాలలో అక్కడివాళ్ళ ఆలోచనలు నిండి



పోయాయి.

అంతలో వనజ వంతు వచ్చింది. వాళ్లడిగిన తిక్క ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలు చెప్పింది వనజ. అయినా వాళ్ళ ముఖాల్లో ప్రశంస కనిపించలేదు.

ఇంటర్వ్యూ అయిపోవడంతో బయటకొస్తున్న వనజకు అప్పుడే వచ్చి ఆగిన కారులోనుంచి దిగుతున్న ఒక జంట కనిపిం

వారు. చూసిన వెంటనే అందమైన జంట అనిపించేటట్లున్నారు.

ఆ జంట మెట్లెక్కుతుంటే దగ్గర్లో చూసిన వనజ సురేష్ కదూ అనుకొని ఆగిపోయింది. అంతవరకూ నీరసంగా ఉన్న వనజ మనసులో హుషారు పెల్లుబికింది. తను చూస్తున్నది నిజమేనా? ఎన్నాళ్లకు కనిపించాడు సురేష్! ఆమె మనసు సంతోషంతో పురివిప్పింది.

లోపలకెళ్ళబోతున్న సురేష్ వనజను చూసి వెంటనే ఠక్కున ఆగిపోయాడు.

వ...వ...జ... అనుకున్నాడు ఒక్కసారి మనసులో.

బాగున్నావా సురేష్? అంది వనజ ముందుగా తానే పలకరిస్తూ.

బాగానే ఉన్నాను మీరు... ఇక్కడ... సందేహంగా మాట మధ్యలో ఆపేశాడు సురేష్.

ఇంటర్వ్యూ కొచ్చానని చెప్పింది వనజ.

ఈమె నా భార్య శీల, ఈమె నా కాలేజ్ ఫ్రెండ్ వనజ అంటూ ఇద్దరికీ పరిచయం చేశాడు సురేష్.

ఇద్దరూ విష్ చేసుకున్నాక అడిగాడు.

ఇంటర్వ్యూ అయిందా? అని.

ఆ ఇప్పుడే అయింది. మా కుటుంబ పరిస్థితుల రీత్యా నేను తప్పనిసరిగా జాబ్ చేయవలసి ఉంది. ఇప్పటికి చాలా ఇంటర్వ్యూలకు వెళ్లాను. కాని ఎక్కడ చూసినా అన్యాయం, అవమానాలే ఎదురయ్యాయి. కనీసం ఈ జాబ్ అయినా రావాలని ఆశిస్తున్నాను అంది వనజ గబగబా ఎన్నాళ్లకు తన కష్టసుఖాలు చెప్పుకోడానికి ఒక స్నేహితుడు దొరికాడనే ఆతృతతో.

ఈ ఇంటర్వ్యూ చేస్తున్నది స్వయంగా మా మామయ్యగారే. నేను ఒక అభ్యర్థి పేరు చెబితే ఆ వ్యక్తి సెలక్టయిపోయినట్లే అన్నాడు సురేష్ వనజ కళ్ళల్లోకి చూస్తూ.

వనజ మనసు ఆనందంతో తేలికయింది ఇక ఆ జాబ్ తనకొచ్చేసినట్లే భావించింది.

సురేష్ నీకు తెలుసు నేను కాలేజీ ఫస్టని. ఆ జాబ్ చేయడానికి నేను అర్హురాలినని. ఏవిధంగానైనా ఖచ్చితంగా ఈ జాబ్ నాకు వచ్చేటట్లు చెయ్యాలి అనేసింది వనజ.

అలా అన్నాక కొంత సిగ్గుపడింది. అతడినుంచి ప్రతిఫలం ఆశించాలని గాని, అలా అడగాలని గాని తను అనుకోలేదు.

కాని పరిస్థితి, అవసరం తనచేత అలా అనిపించచేసింది.

వనజ అలా అడిగిన వెంటనే సురేష్ వనజ కళ్లలోకి ఏమిటో వెతుకుతున్నట్లుగా చూసి ప్రక్కకు తిరిగి భార్యతో శీలా నేను వనజతో కాస్సేపలా పార్క్‌కెళ్లి వస్తాను. ఇంటర్వ్యూస్ అయిపోయాక ఇంటికెళ్లిపో. అనేసి ఆమె సమాధానానికై ఎదురుచూడకుండా కారువైపు నడిచాడు సురేష్.

అతను అలా అంటాడని వనజ ఊహించలేదు. శీలాను వదిలేసి తామిద్దరూ వెళ్లడం అనేది తనకు నచ్చని విషయం.

కాని అప్పటికే శీలా లోపలికి వెళ్లిపోయింది.

ఏమిటి వనజా ఆలోచిస్తున్నావు? రా అలా పార్క్ కెళ్లి మాట్లాడుకుందాం అన్నాడు సురేష్ ముందుకు నడుస్తూ.

అతడి ధోరణికి, అతడి ఏకవచన సంబోధనకు క్షణంలో వెయ్యోవంతు మనసు చివుక్కుమన్నా పట్టించుకోలేదు వనజ.

తనను అర్థం చేసుకొనే అప్పుడు, ఆత్మీయుడు కనిపించాడనే ఆనందంతో అతని వెనుక నడిచింది వనజ.

* * *

ఆ కాలేజీలో వనజ కేవలం లేడీస్ యూనియన్ లీడర్ మాత్రమే కాదు. చదువులోను, తెలివితేటల్లోను అన్నిటిలో మా ఫస్టు వరుసలో నిలబెట్టదగ్గ మనిషి.

వనజ తండ్రి ఆ కాలేజీలోనే లెక్చరర్. వనజకు ఒక అక్క, ఒక చెల్లి, ఇద్దరు తమ్ముళ్లు.

వనజ సెకండ్ డిగ్రీ చదువుతున్నప్పుడు ఇంటర్‌లో చేరాడు సురేష్. చాలా అందమైనవాడు. చలాకీ గలవాడు. కాని ఆర్థికంగా బాగా వెనుకబడి ఉండటం వలన ఎందులోను అతడికి సరైన ప్రోత్సాహం లేదు.

సురేష్ తండ్రి చిన్నప్పుడే పోయాడు. స్థోమత లేకపోయినా ఎంతోకొంత తన కొడుక్కి చదువు చెప్పించుకోవాలని అతడి తల్లి పార్వతి ప్రయత్నం. తల్లి కష్టపడుతున్నా ఫీజులకి, పుస్తకాలకీ సురేష్ అవస్థ పడుతూనే ఉన్నాడు.

ఎకౌంట్స్ అర్థంకాక అప్పుడప్పుడు వనజ తండ్రి విశ్వనాథం దగ్గరకు వస్తుండేవాడు సురేష్.

అప్పుడు గమనించింది వనజ సురేష్‌లో తెలివిని, చురుకుదనాన్ని, అతడిలో ఉన్న లక్షణాలకు కొంత ప్రోత్సాహాన్ని ఎరువుగా వేస్తే పైకి రాగలడని కూడా అనిపించింది.

తండ్రిని రెస్టు తీసుకోమని తానే సురేష్‌కు ఎకౌంట్స్ చెప్పేది. అతడి తెలివితేటలను ప్రశంసించేది. దేనికీ నిరుత్సాహపడవద్దని, పట్టుదలతో పైకి రావడానికి ప్రయత్నించాలని హితవు చెప్పేది. శ్రద్ధగా చదువుకోమని ప్రోత్సహించేది.

ఒకసారి ఫీజు కట్టలేని పరిస్థితులలో కాలేజీ మానెయ్యాలనుకొనే దశలో అతడి ఫీజు తానే కట్టి అతడు బిడియపడుతుంటే సాటి మనుష్యులం ఒకరికొకరం సహాయం చేసుకోవడం తప్పుకాదని నచ్చజెప్పి అతడికి ధైర్యాన్నిచ్చేది. ఫీజులకు, బుక్స్ కొనుక్కోవడానికి అతడికి సహకరిస్తూ ఉండేది.

మీ ఋణం ఎలా తీర్చుకోగలనో అంటూ ఆ కుటుంబంపట్ల ఎంతో భక్తిశ్రద్ధలతో ఉండేవాడు సురేష్.



### హోం వర్క్

"ఎప్పుడూ హోం వర్క్ తప్పులు చేసే వాడివి. ఈరోజు కరెక్టుగా చేసుకొచ్చావే" ఆశ్చర్యంగా అడిగారు మాస్టారు.

"మా నాన్న ఊరికెళ్లడంతో ఈ రోజు నేనే సొంతంగా హోం వర్క్ చేసుకొచ్చాను మాస్టారు" అసలు సంగతి చెప్పాడు రవి.

—ఎస్.ఎస్.మూర్తి (నెల్లూరు)

తరువాత వనజ తండ్రికి ట్రాన్స్‌ఫర్ కావడంతో ఆ ఊరిని వదలవలసి వచ్చింది. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తనకు లెటర్ వ్రాయమని చెప్పి అడ్రస్ ఇచ్చింది వనజ. ఫీజులకు డబ్బు కావాలని అతను వ్రాస్తే వనజ పంపేది. తరువాత తరువాత అతడి నుంచి లెటర్స్ రావటం ఆగిపోయింది.

మరికొన్నాళ్లకు తెలిసింది. సురేష్‌ను ఎవరో శ్రీమంతుడి ఏకైక కుమార్తె వలచి వరించి పట్టుపట్టి అతడినే పెళ్లి చేసుకుందని అతడి జీవితం ఎంతో హైక్లాస్‌లో ఉందని విన్నది. పెళ్లికి తనకు వెడ్డింగ్ పంపనందుకు బాధపడినా ఎక్కడున్నా అతడు హేపీగా ఉన్నాడు అనుకుని సంతోషపడింది వనజ.

ఆ తరువాత వనజ కుటుంబంలో చాలా మార్పులొచ్చాయి. హఠాత్తుగా తండ్రి మరణించడంతో ఆ కుటుంబంలో ఆవేదన అలుముకుంది. తండ్రి ద్వారా వచ్చిన డబ్బుతో వనజ అక్క పెళ్లి చెయ్యగలిగారు. మిగతా కుటుంబభారమంతా వనజ మీద పడింది.

ఒక ప్రైవేటు కాన్వెంట్‌లో జాబ్ చేస్తూ ట్యూషన్స్ చెపుతున్నప్పటికీ కుటుంబాన్ని నెట్టుకురావడం కష్టంగానే ఉండేది వనజకు. ప్రతి జాబ్‌కు అప్లై చేయడం, ఇంటర్వ్యూ కెళ్లడం, నిరాశగా ఇంటికి రావడం ఇది ఆమె దినచర్యలో భాగమైపోయింది. ఏ ఇంటర్వ్యూకు వెళ్లినా ఈ జాబ్ తనకు తప్పక వస్తుందని ఆశతో వెళ్లడం, బాధపడటం.

ఈ ఇంటర్వ్యూకు కూడా ఎంతో ఆశతో వచ్చి నిరాశగా బయటకొచ్చిన వనజకు సురేష్ కనిపించడంతో ఇక ఆ జాబ్ తనకొచ్చేసినట్లుగా సంతోషపడిపోయింది.

కారు సడన్ బ్రేక్‌తో ఆగడంతో ఆలోచనలమండి బయటపడింది వనజ.

ఇద్దరూ ఒక పాద ప్రక్కన పచ్చిక మీద కూర్చున్నారు.

సురేష్ ఏమి చేస్తున్నావు? నీ మేరేజ్ అయ్యిందని, నీ లైఫ్ చాలా ఆనందంగా గడుస్తోందని విని చాలా సంతోషించాను. నీవు కనిపించిన వెంటనే నాకెంత ఆనందం కలిగిందో తెలుసా! నా మనసు విప్పి చెప్పుకోవడానికి ఒక అప్తుడు దొరికాడు అన్నంత తృప్తి కలిగింది. నీవు అదృష్టవంతుడివి సురేష్. నీ భార్య చాలా అందమైనదే కాదు. చాలా సంస్కారవంతురాలు కూడా! మీ జంటను చూస్తుంటే నాకెంతో తృప్తిగా ఉంది అంది వనజ నిండుగా.

నా పెళ్లికి నిన్ను పిలవాలి అనుకున్నాను వనజా కానీ అనుకోకుండా అర్జంటుగా జరిగిపోవడం వలన వీలుపడలేదు. ఇంతకీ నీవు ఏమి చేస్తున్నావు? ఇంకా మేరేజ్ చేసుకోలేదేమిటి? ఆసక్తిగా అడిగాడు సురేష్.

వనజకు సురేష్ మాటలు క్రొత్తగా ఉన్నాయి. అతడు పేరు పెట్టి పిలవడం, ఏకవచన సంబోధన క్రొత్తగా ఉన్నప్పటికీ సన్నిహితంగా ఉండటం వలన పట్టించుకోలేదు వనజ.

మనసు విప్పి తన మనసులో విషయాలన్నీ చెప్పుకుంటూ మనస్ఫూర్తిగా మాట్లాడింది వనజ.

వనజ తండ్రి చనిపోయిన విషయం విని సురేష్ కొంత చలించినట్లు కనిపించినా ఆమెకు ఈ జాబ్ చాలా అవసరం అనే విషయం కూడా అతను బాగా గ్రహించాడు

అతను ఒకప్పటి సురేష్ కాదని, ఎదుటి వాళ్ల అవసరాన్ని, బలహీనతలను కనిపెట్టి వాటిమీద దెబ్బకొట్టి తనకు అనుకూలంగా మార్చుకోగల కోడెనాగు నేటి సురేష్ అని వనజ గ్రహించలేక తన ధోరణిలో తను మాట్లాడుతూనే ఉంది.

అంతలో అన్నాడు సురేష్. వనజా నీ మనసు నాకు తెలుసు. నీ అందం, నీ వ్యక్తిత్వమూ నాకు తెలుసు. నా కంటే నీవు వయసులో కొంత పెద్దదానివైనా నీవంటే నాకెప్పుడూ ప్రత్యేకమైన అభిమానముంది. కాని ఆ ఇష్టాన్ని నీ దగ్గర వ్యక్తపరిచే అవకాశంగాని, వీలుగాని కుదరలేదు నాకెప్పు

ఇప్పుడు నా మనసులో విషయం చెప్పుకుంటున్నాను. అర్థం చేసుకో అపార్థం చేసుకోకు అన్నాడు సురేష్ తలవంచుకుని మెత్తగా నెమ్మదిగా.

అతడి మాటల ధోరణి వింతగా అనిపించి అతడు చెప్పే విషయమేమిటా అని అయోమయంగా వింటుంది వనజ.


ఏ విషయాన్నైనా ఫ్రాంక్‌గా మాట్లాడే మనిషిని నేను. వనజా నీకే జాబ్ చాలా అవసరం అని నాకు తెలుసు. నీవు నాకు చేసిన సహాయం కూడా గుర్తుంది. నీవు ఫీజులకు, పుస్తకాలకు అప్పుడప్పుడు చేసిన సహాయాన్ని లెక్కచూస్తే కొన్ని వందలు మాత్రమే అవుతాయి. కాని ఈ జాబ్ వేలతో ముడిపడివుంది. అయినా ఈ జాబ్ నీకిప్పించడం నాకు చాలా ఈజీ. అయితే నీవు నాదో కోరిక తీర్చాలి అన్నాడు సురేష్ సంశయిస్తూ.

నేను నీకు తీర్చగలిగే కోరికలు ఏముంటాయి? ఆశ్చర్యంగా అడిగింది వనజ.

ఒక నైట్ నీవు నాదానివైతే, ఈ జాబ్ నీదే అవుతుంది. స్థిరంగా అనేశాడు సురేష్.

తల తిరిగినట్లయింది వనజకు.

నువ్వు నువ్వేనా సురేష్ మరింత ఆశ్చర్యంగా అడిగింది.



## పెద్ద నవల

పేజీల కొద్దీ నవలలు రాయడమనేది ఎంతో తేలికయిన విషయం కాదు. ప్రపంచంలో ఇప్పటివరకూ వచ్చిన నవలలన్నిటిలోకీ అతి పెద్ద నవల ఫ్రెంచ్ భాషలో వచ్చింది. జూల్స్ రొమైన్స్ రాసిన 'మెన్ ఆఫ్ గుడ్‌విల్' అనే ఈ నవల ఇంగ్లీషు భాషలోకి అనువదించినప్పుడు 5000 పేజీలలో 14 సంపుటాలుగా వుంది.

పి.సంపత్

కంగారు పడకు వనజా ఒక వారం టైం ఇస్తున్నాను. ఆలోచించుకొని నీ నిర్ణయం తెలియచేయి. ఇక చెప్పవలసినది ఏమీ లేనట్లు లేచి నిలుచున్నాడు సురేష్.

వనజకు దుఃఖం ఆగడం లేదు. అతడు తననంత అవమాన పరిచినందుకు కాదు ఆమె బాధపడేది. అతడు అటువంటి కోరిక కోరినందుకూ కాదు ఆమె బాధపడేది. తను నీరుపోసి పెంచిన వృక్షం పెద్దదై విష ఫలాలనిస్తుంటే పెంచిన ఆ దాత గుండె ఎంతగా రగిలిపోతుందో వనజ పరిస్థితి కూడా అలాగే వుంది. అతడు తనను అవమానపరచిన దానికంటే అతడెంతో ఉన్నతుడు కావాలని, కాగలడని తలచిన తన తలపులను తల క్రిందులు చేసిన అతడి వ్యక్తిత్వ హీనత్వానికి విలపిస్తుంది ఆమె హృదయం.

ఆమె భారంగా లేచింది, మాట్లాడటానికి నోరు పెగలడం లేదు. అతి కష్టం మీద అన్నది, నా సమాధానం కోసం వారం రోజులు ఎదురు చూడనవసరం లేదు సురేష్. నా మనసును చంపుకుని ఆ జాబ్‌ను నేను గెలుచుకోలేను. నాకాజాబ్ అవసరం లేదు. నీవు ఏమిటో నీకు తెలుసు. నీవు ఏమి మాట్లాడుతున్నావో కూడా నీకు తెలుసు. నీకు నాపట్ల ఏకాస్తైనా అభిమానముంటే నీ వ్యక్తిత్వాన్ని మార్చుకోవడానికి ప్రయత్నించు. ఇదే ధోరణిలో జీవించదలుచుకుంటే ఊహగానైనా నన్ను ఎప్పుడూ తలచుకోకు. గుడ్‌బై. అనేసి అతడి జవాబుకైనా చూడకుండా చకచగా వెళ్ళిపోయింది వనజ.

ఆమె వెళ్ళిన వైపు అలాగే చూస్తూ ఉండిపోయాడు సురేష్ కొన్ని క్షణాలు.

* * *

కాళ్ళ బూట్లైనా విప్పకుండా వచ్చినవాడు వచ్చినట్లే మంచానికడ్డంగా పడిపోయిన భర్తను చూసి కాస్త కలవరపడినా బింకంగానే కూర్చుంది షీల.

భార్య దగ్గరుందనే ఇంగిత జ్ఞానమైనా లేకుండా పరాయి స్త్రీతో షికారుకు బయలుదేరిన ఆ భర్తగారి గురించి ఏమనుకున్నా, ఏమన్నా ప్రయోజనం లేదని మౌనంగా ఉండిపోయింది.

కొంతసేపటికి లేచి షూస్ తీసి కాళ్ళు కడుక్కొని అన్నం పెట్టు అంటూ డైనింగ్ రూమ్‌లోకి దారితీశాడు సురేష్.

ఇప్పటికి షికార్లయ్యాయా! ఇప్పుడు ఆ జాబ్ ఆమెకోసం సిఫార్స్ చేస్తారు కాబోలు అంది ఉండబట్టలేక షీలా వ్యంగ్యంగా.

లేదు షీలా ఈ జాబ్ ఆమెకు ఇవ్వడం లేదు. ఈ జాబ్‌కు ఆమె అర్హురాలు కాదు. అన్నాడు సురేష్ మామూలుగా.

ఒక్క క్షణం షీలా మెదడు ఆలోచించడం మానేసింది. వెంటనే మొత్తం విషయం గ్రహించింది.


భర్తకు మీల్స్ పెడుతూనే ఆలోచిస్తోంది. అంటే ఆమె ఈయనకు లొంగలేదన్న మాట. భర్తతత్వం తనకు బాగా తెలుసు. తనకు ఉపయోగపడరనుకున్న వారికి తను ఏవిధమైన సహాయం చేయడు. అంతవరకూ వనజపట్ల ఉన్న కోపం ఒక్కసారిగా ఎగిరిపో

యి ఆమెపట్ల ఉన్నతభావం ఏర్పడింది శీలాకు.

తన భర్తకోసం వచ్చే స్త్రీలను చూసిన శీలా, తన భర్తతో క్లబ్‌లకు తిరిగే ఆడవాళ్లను చూసిన శీలా వనజ వ్యక్తిత్వానికి అబ్బురపడింది. గడ్డి మొక్కల మధ్య తులసి మొక్కలా కనిపిస్తున్న వనజ వ్యక్తిత్వానికి అయస్కాంతంలా ఆకర్షితమయింది శీలా.

వనజ ఎంత బాధపడుతుందో, మంచికి స్థానం లేదని విరక్తి చెందుతుందేమో! నీతి, నిజాయితీలకు విలువ నిచ్చి స్థానమివ్వకపోతే కొన్నాళ్లకు సమాజంలో ఈ ఉన్నత భావాలు పూర్తిగా అంతరించిపోయే ప్రమాదముంది. అటువంటి పరిస్థితిని ఏర్పడనీయకూడదు. వెంటనే ఒక నిర్ణయం తీసుకుని తండ్రికి



ఫోన్ చేసింది షీలా.

* * *

ఇంటికొచ్చి వెంటనే ఇంటర్వ్యూ ఎలా జరిగిందమ్మా అన్న తల్లి ప్రశ్నకు బదులుగా ఈ జాబ్ నాకు రాలేదమ్మా అనేసి గదిలోకెళ్లి తలుపేసుకుంది వనజ.

ఆ రాత్రికి తీవ్రంగా జ్వరం వచ్చేసింది వనజకు.

ఈ జాబ్ కాకపోతే మరో జాబ్ వస్తుంది అంతేగాని ఇలా బాధపడిపోతే ఎలా అక్కా అంటూ నుదుటిపై చెయ్యేసి ధైర్యం చెబుతున్న పదవ తరగతి చదువుతున్న చిన్న తమ్ముడు కృష్ణవైపు ప్రేమగా చూసింది వనజ. ఒకప్పుడు సురేష్‌ను కూడా ఇంత వాత్సల్యంగాను చూసుకొనేది.

మళ్లీ ఆమెలో ఆలోచనలు ముసురుకున్నాయి. సమాజం ఎటువైపు పోతోంది? మంచికి, నీతికి విలువే లేదా? ఎన్ని ఆశయాలతో పెరిగింది తను? ఇప్పుడు తనకు ఎదురవుతున్న పరిస్థితులేమిటి? నిజాయితీకి స్థానమే లేదా! అవినీతికి, అన్యాయాలకే స్థానముందా? ఆక్రోశిస్తున్న ఆమె మనసుకు అంతరాత్మ ఎదురు తిరిగింది, నిరుత్సాహపడకు, అలనాడు గాంధీజీ అహింసా వాదాన్ని చేపట్టినప్పుడు అనేక క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యాయి. అన్నిటినీ ధైర్యంగా ఎదుర్కొని అదే ఆయుధంతో స్వాతంత్ర్యాన్ని సంపాదించాడు ఆ మహనీయుడు. అలాగే మనం చేస్తున్నది మంచైనపుడు మనలో మంచి ఉన్నప్పుడు ఎటువంటి దుష్ట పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోగలిగితే ఎప్పుడో ఒకప్పుడు ఉన్నతత్వానికి మహోన్నత స్థానం లభించగలదు. దిగులుపడకు. అంటూ అంతరాత్మ చేసిన ప్రబోధానికి తాత్కాలికంగా వనజ మనసు చల్లబడింది

మూడు రోజులకు గాని వనజ మామూలు మనిషి కాలేకపోయింది.

నాలుగో రోజు మధ్యాహ్నం క్లాసులకు కాన్వెంట్‌కు వెళ్లబోతుంటే పోస్ట్‌మాన్ ఒక రిజిస్టర్ పోస్టిచ్చి వెళ్లాడు.

ఏమై ఉంటుందా అని ఆతృతగా చించి చూసిన వనజకు ఆ కవరులో జాబ్ ఆర్డర్స్‌తోపాటు ఒక లేఖ కూడా ఉండటంతో ఆశ్చర్యంతో మరోసారి చూసింది అడ్రస్‌ను తనకేనా అని.

అడ్రస్ తనదే కావడంతో ఇది కలో నిజమో అర్థంగాక అందులో లెటర్ విప్పింది.

వనజగారికి,

షీలా వ్రాయునది. ఆశ్చర్యపోతున్నారా? సాటి స్త్రీగా మీ ఆవేదనను అర్థం చేసుకోగలను. ఒక్కొక్కసారి మనం అనుకున్నవి అనుకున్నట్లు జరగకపోయినా బాధపడకూడదు. నేను వివాహం పట్ల ఎన్నో ఆశలతో అందమైన భర్తను చేసుకోవాలని ఏరికోరి ఈయనను చేసుకున్నాను. ఇప్పుడు అశాంతిగా ఉంటున్నాను. మొదట్లో మంచిగానే ఉండేవారు. రానురాను అతని తత్వం మారింది. వయసుంది. ఐశ్వర్యముంది. ఈ రెండూ ఉన్నపుడు జీవితాన్ని హేపీగా

ఎంజాయ్ చెయ్యడమే వివేకం అనే ధోరణిలో పడ్డాడు. బలహీనతలలో మునిగితేలడంలోనే జీవిత ఆనందముందని భ్రమపడుతున్నాడు. మార్చాలని ప్రయత్నించి విఫలమయ్యాను.

ఏమి లేనివాళ్ల దగ్గరకు సిరివస్తే మనసును, శరీరాన్ని అదుపులో పెట్టుకొని ఆ సిరిని సద్వినియోగం చేసుకోగల కెపాసిటీ ఏ కొద్దిమందికో మాత్రమే ఉంటుంది. నా భర్తలో ఆ కంట్రోలింగ్ పవర్ లేకపోవడం వల్లనే నాకు శాంతి కరువయింది. ఆయనకిచ్చిన బిజినెస్ అధికారాలను ఇప్పుడిప్పుడే నా కోరిక మేరకు నా తండ్రి తన హస్తగతం చేసుకుంటున్నారు.

మీ పరిస్థితిని నేను అర్థం చేసుకున్నాను. మీ సర్టిఫికెట్స్ కూడా చూశాను. ఈ జాబ్‌కు మీరు అన్ని విధాలా అర్హులు. ఈ జాబ్‌కోసం మీరు ఇంత దూరం రానవసరం లేదు కూడా. మీ ఊళ్లోనే ఉన్న ఈ ఆఫీస్ బ్రాంచ్‌లోనే మీరు జాయినయ్యేటట్లు ఆర్డర్స్ పంపిస్తున్నాను.

నా భర్త వలన మీకేమైనా అవమానం జరిగి ఉంటే అతని తరఫున నేను క్షమార్పణ కోరుకుంటున్నాను. క్షమించగలరు.

సెలవ్

షీలా.

ఉత్తరాన్ని ముగించిన వనజ మనసు ఆనందంతో నిండిపోయింది. షీలాలో ఆలోచనా సరళికి, ఆమె సంస్కారానికి వనజ కళ్లల్లో నీళ్లు చిమ్మాయి.

తాను ఎక్కడో చదివిన ఆడదానికి ఆడదే శత్రువు అనే సూక్తి అందరికీ వర్తించదని షీలా లాంటి సహృదయులు కూడా ఉంటారని 'తెలుసుకున్న వనజ మనసు సంతోషంతో ఎగసిపడింది.

ఈ శుభవార్తను తల్లితో చెప్పడంకోసం వంటగదిలోకి పరుగుపెట్టింది వనజ ఉత్సాహంగా.

అదే సమయంలో ఎ.సి కార్లో తన ఫ్యాక్టరీకి వెళుతున్న షీలా అనుకుంటూంది, ఆడదానికి ఆడదే శత్రువనే సూక్తి నిజం కాదని వనజలాంటి సహృదయులూ ఉంటారని.

ఇప్పుడు ఆమె మనసు హాయిగా వుంది. ✱



### మరొకటి

"ఏమండీ! మన చంటాడు నా పట్టుచీరమీద ఇంకు ఒలక పోసేశాడు" బాధగా అంది భార్య భర్తతో.

"పోనీలే? మరో ఇంకు బాటిల్ కొనుక్కోవచ్చు" పరధ్యానంగా అన్నాడు భర్త.

—అవసర్తి రాంబాబు (తుని)